కథానిక

# ఎదురు చూసిన అతను!

వై. భాస్కరలక్ష్మి

కమల దృష్టి సరాసరి కాంపౌండులోకి కేంద్రీకరింప బడింది ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్లు.

అదిగో. అతనే సందేహములేదు. గంటల తరబడిగ తాను ఎదురు చూస్తున్నది ఆ వ్యక్తి కోసమేగా! కమల సంతోషానికి మేరలేక పోయింది. ఈ రోజైనా తన ఆశలు ఫలించాలని దేవుని ప్రార్థించింది. ఇటే వస్తున్నాడు. అబ్బ: ఎన్నాళ్ళకి ఇంత అదృష్టం, తన దగ్గరకు రకు తప్పకుండ వస్తాడు. అని ఊహిస్తూ కుర్చీలోంచిలేచి వరండాలోకి వెళ్ళింది చూద్దామని.

“ఎక్కడికీకమలా ప్రయాణం?” అంది రూమ్ మేట్ సరోజిని. కమల మనస్సు చివుక్కుమంది. సరోజిని మీద తగనికోపం వచ్చింది. ఎంత రూమ్మేట్ అయితే మాత్రం, అవసరములేని విషయం ఒక్కటి ఉండదు ఈ సరోజినికి! ఎక్కడకి వెళ్తామనుకున్నా శకునిపక్షిలా వేస్తుంది ప్రశ్న ఎక్కడికని, కమల వినిపించుకోకుండ గుమ్మం దగ్గరకు వెళ్ళింది.

“పోని ఎక్కడికైనా వెళ్తే వెళ్ళావుగాని కాస్త నా పెన్ను యిచ్చి వెళ్ళు తల్లి” అంది సరోజిని. కమల వెనుకకు తిరిగి “ఏమిటి?” అంది.

“నాపెన్ను, యిందాకనువ్వుతీశావుగా”అంది సరోజిని కాస్త గట్టిగా. “ఏ పెన్ను నాకెప్పుడిచ్చావు” అనిఅడిగింది! కమల. “రామ రామ యిదొక అబద్ధం కూడానా? గంట క్రిందట విషయం మరచిపోతేఎలా, అయినా నిన్నని ప్రయోజనంలేదు ఇదంతా ఆ ఆఖరిసంవత్సరంమహిమ” అనిగొణుగుతూ కమల మంచంమీద చిందరగా పడిఉన్న పుస్తకాలు, అలమరాలోను వెదుకనారంభించింది సరోజిని.

ఈ గొడవ వదిలితే చాలురా భగవంతుడా అనుకుంటూన్న కమల ఇదేసమయమని, రూమ్‌లోంచి బయటపడింది.

తను ఎవరికోసమైతే నిరీక్షిస్తున్నదో ఆవ్యక్తి మేడమీదకు రానే వచ్చాడు. తప్పకుండా తన వైపునకే కూడ వస్తున్నాడు. కమలకు ఆతృత హెచ్చయింది. తప్పకుండ తనవైపు చూస్తాడనుకుంది. కాని చూస్తూఉండగానే తనప్రక్కనుండే వెళ్ళిపోయాడు. ఇంతసేపుగా నిరీక్షిస్తున్న శ్రమ వృధా అయింది. ఆశలన్ని అడియాశలయ్యాయి. వికసిత వదనారవిందం అంతలోకే ముకుళించుకుంది. ఆశాభంగం. తనేం తప్పు చేసింది? ఈరోజైన తప్పక తన దగ్గరకు వస్తాడని తన కోర్కె ఫలిస్తుందని కలలుకంది. దైవం తనపట్ల పూర్తిగ ప్రతికూలిస్తున్నాడు. ఎలాగోశరీరాన్ని మెల్లగ మంచం వద్దకు చేర్చింది. తల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయి. మనస్సు వివిధ దేశాలలో పర్యటించడం మొదలు పెట్టింది.

“మంచంమీదే ఉంచుకుని తెలియదంటావు” అంది సరోజ. కమల నిశ్శబ్దాన్ని వాంఛిస్తూంది అందుచేత సరోజనితో సంభాషించాలనిపించలేదు. కనీసం అడిగిన ప్రశ్నకైనా సమాధానం కూడ యివ్వకుండ మంచంమీద పడుకుంది. సరోజినికి, కమల విషయం ఏమి అర్థంకాలేదు.

కమల, సరోజిని ఆసర్సు చదువుతున్నారు. క్లాసుమేట్సు కాకుండ రూమ్మేట్సుకూడ. సంగా

వాలు మాత్రం వేరుగ ఉండేవి. అభిప్రాయాలు భిన్నంగాఉన్నా వారి స్నేహానికి మాత్రం ఎటువంటిలోపము లేకపోయింది. కమల మితభాషి. ఎలాంటి కష్టాలు వచ్చినా, మనస్సులో బాధ పడటమేగానిపైకిచెప్పదు. సరోజిని పట్టిగాభరా మనిషి. గోరంత విషయం కొండంత చేస్తూంది. ప్రతివిషయంలోను ఖంగారే. కమలపై తగని అభిమానం. రోజూ సాయంకాలం కమలతో కొంతసేపైనా హాస్కు కొట్టందే పుస్తకాలు తీసేదికాదు. చివరకు పరీక్షలైనా సరే.

రాత్రి పదిగంటలైంది. సరోజిని చదువుతూంది. కమల భోజనం అయిన వెంటనే నిద్రపోయింది. నిద్రలో పలవరించటం మొదలు పెట్టింది. అదిగో! అతనేవస్తున్నాడు, నా వంకే. ఈరోజు ఆశాజ్యోతి ఫలిస్తుంది. రోజూ సమయానికి వస్తాడు!

ఇదంతా పరీక్షగా విన్న సరోజినికి మతిపోయింది. ఓహో ఇదాసంగతి. తను ఎవరికోసమో కలలు కంటుందన్నమాట! అందుకే పదిరోజుల నుండి అమ్మాయిగారికి పరధ్యానం హెచ్చయినది. సాయంత్రం అన్యోనరికి వీధికచేరి, వేస్తూ ఉంటుంది. పోని ఆ విషయం ఏదో పైకే ఏడవరాదు? భయందేనికీ అనుకుంది. ఒక్కసారి సుధాకర్ విషయం తలుచుకుంటే జాలివేసింది. అమాయకుడతను. ఎంతటి మోసానికి తల పెట్టింది ఈ కమల అనుకుంది. కాని మళ్ళీ తనే తప్పభిప్రాయం పడుతున్నానేమో, అయిన నిద్రలో అనేక విషయాలు పలవరిస్తూంటారు. అవన్నీ నిజమాతాయా ఏమిటి అనుకుంది. ఎన్నివిధాలా ఆలోచించిన తృప్తి అయిన సమాధానం ఒకటి కనుపించలేదు సరోజినికి.

మరుచటిరోజు సరోజిని హాస్టలుకు రావటం కొంచెం ఆలస్యమైంది. వచ్చేసరికి కమల మంచం మీద పడుకుని ఉంది. ఏదో అంతులేని ఆలోచనలతో సతమతమాతూంది.

"అలా పడుకున్నావేం కమలా?" అంది.

"ఏమిటో నాకు వంట్లో సరిగాలేదు సరూ,"

"ఏం జ్వరమేమైనా వచ్చిందా?"

"అబ్బే అదేమికాదు నాకు నిద్ర వస్తుంది, నన్ను మాట్లాడించకు లెద్దూ" అంది కమల కళ్ళు మూసుకుంటూ.

"అబ్బో కథ చాలాదూరమేపోయింది. నేను మాట్లాడితే ఊహా గానంలోని విహంగయానానికి బ్రేకులు పడుతుంది కాబోలు అయినా నాకెందుకు" అనుకుంది సరోజ. కనీసం రాత్రి ఎందుకలా పలవరించావు అని కూడ అడగాలనిపించలేదు సరోజకి.

ఇంతలో దాసీపిల్ల గౌరి కాఫీ తెచ్చింది. సరోజినికి కాఫీత్రాగి అవతలకువెళ్ళి గౌరినిపిలిచి "కమల ఈరోజు కాఫీత్రాగిందా" అనిఅడిగింది.

"త్రాగుతూండగానే ఎవరో తెలిసినవారు వచ్చినట్లుంది గదిలోంచి బయటకు వెళ్ళారు."

"ఎవరువచ్చారుగౌరి మొగవారా? ఆడవారా?"

"మగవాళ్ళే, ఒక్కరే లాగుందమ్మా"

"పెద్దవాడేనా చిన్న అబ్బాయా?"

"ఏమో తల్లి నేనంత పరీక్షగాచూడలేదు."

"వచ్చినతను రూములోకి వచ్చాడా" అంది.

"లేదు కమలమ్మగారే వెళ్ళి మాట్లాడి వచ్చారు. లోపలికి వస్తూనే యింక కాఫీ వద్దు, కప్పుతీసుకునివెళ్ళిపో అన్నారమ్మా" సరోజినిలో జనించిన అనుమానానికి గౌరి చెప్పిన మాటలు సాక్ష్యాలుగా అనిపించాయి. అయినా తనకెందుకీ గొడవ వినాశకాలె విపరీత బుద్ధి అన్నారు అనుకుంటూ రూములోకి వెళ్ళిపోయింది.

రాత్రి పుస్తకాల వద్ద కూచున్నదన్నమాటే గాని మనస్సంతా కమల విషయమే ఆలోచిస్తూంది. ఏమిటిఇలాగమారిపోయింది అనుకుంది.

కమల మీాద ఉండే ప్రేమాభి మానాలు అంతరించిపోయాయి. విద్యవల్ల కమలకు విజ్ఞానం, రాలేదనుకుంది. అయిన యింత చపల చిత్తం అయితె ఎట్లా అనుకుంది. ఈరోజుకూడ యధాప్రకారంగా పలవరించటం మొదలు పెట్టింది. అదిగో అతనే ఈరోజు తప్పకుండ వస్తాడు. తన యిష్టఫలం నెరవేరుస్తాడని కాని అయ్యో ఈ నాడుకూడ ఇంతేనా, తాను దరహాసితవదనంతో అతనిని ఆహ్వానించిందే, కాని దృష్టిని తన తనవైపు పారేస్తె తప్పా అని ఏదో ఇంక అంటూనేఉంది. కాని ఈరోజు సరోజిని మరి భరించలేకపోయింది. తనలో పొడచూపిన అనుమానం ధృఢమైంది. ఈ సమాచారం తనఫ్రెండ్ జయలక్ష్మికి చెప్తేనో, అనుకుంది. అనుకున్నదే తడవుగ జయలక్ష్మి రూమ్‌కి వెళ్ళింది.

"రా, సరోజా రా, ఏమిటి విశేషం యింత అర్ధరాత్రి ఇలా దయచేశావు అంది."

"ఈ మధ్య మా కమల నా తలకి బాగ మేతపెడుతూంది దాని వ్యవహారం ఏమి బాగ లేదు జయా" అంది సరోజిని.

"ఏం వంట్లో బాగులేదా లేక జ్వరమేమైన వచ్చిందా" అంది.

"జర్వం కాదు పాడుకాదు. ఏదో వర్ణాతీతమైన బాధ ఆమెగారికి. అయినా అసలు జాడ్యం వేరులే" అంది మెల్లగా.

"అదేమిటి ఈరోజు వింతగ మాట్లాడుతున్నావు"

"మనుష్యుల తత్వాలు మారుతూంటె మనం వింతగానే మాట్లాడవలసి వస్తుంది."

"నీ మాటలు నాకర్థము కావటంలేదు సరూ కాస్త స్టేజిఘోరణి విడచిపెట్టి వివరంగ చెప్పవే"

"ఏంచెప్పమన్నావు. పదిరోజులనుండి కమల పూర్తిగ మారిపోయింది. మనిషి యిక్కడ మనస్సు మాత్రం గగనవీథుల్లో. పరధ్యానం ఎక్కువయింది. మాట్లాడిస్తే విసుగు, కమలకి రాత్రి పలవరించే అలవాటు. సాధారణంగ పగలంతా అనుకున్న విషయాలు రాత్రి నిద్రలో పలవరిస్తుంది. నాల్గురోజులైె రాత్రి వింటూంటే నాకేమిటో అనుమాన మేస్తోంది."

రోజు సాయత్రం ఎవరో తనతో వస్తానని ప్రమాణం చేసినట్లుగ ఎదురు చూస్తూంటుంది. పైగా అతను వచ్చినా తన దగ్గరకు రాలేదు మాట్లాడలేదు అని బాధ పడుతుంది."

"అదేమిటి సరోజా ఇలామారింది! అయినా తనకు పెండ్లికూడ అయింది కదూ!"

"అయింది కనుకనే మనం యిప్పుడు అనుకోవటం. ఫోర్తానర్సు చదువుతూ ఉండగానే సుధాకర్‌తో అయింది. పాపం అతని మాట తల్చుకుంటె జాలేస్తుంది. అంది సరోజిని.

"అతను మంచివాడు కాదా ఏమిటి సరోజా?"

"అన్యాయం,అతను చాలమంచివాడు బుద్ధికి బృహస్పతి అని చెప్పవచ్చు. రూపానికి మన్మధుడు. పైగ ఇంజనీరింగ్ పేసయ్యాడు. ధనవంతునిబిడ్డ. ఒకమాటలో చెప్పాలంటే కమలకే విషయంలోను తీసిపోడు మొన్ననే గవర్నమెంటు అమెరికాకు పంపించారు అంది."

ఎన్ని డిగ్రీలున్నా కమల కిష్టంలేదేమో

"అబ్బే ఇద్దరూ ఎంతో యిదిగా ఉండేవారు."

"అమెరికాలో అతనెన్నాళ్ళుంటాడూ?"

మూడేళ్ళట ఈసంవత్సరం కమలకూడ పరీక్షలవగానే అమెరికా తీసుకొని వెళ్ళేందుకు ఏర్పాట్లు చేశాడట. తను వెళ్ళేరోజు స్వయంగ వచ్చి నాతో చెప్పాడు. కమలని జాగ్రత్తగా చూస్తూండండి. అనవసరంగా నాకోసం బెంగ పెట్టుకోవద్దని, కాస్త శ్రద్ధగా చదవమని, చెప్పండి. మీరు తనఫ్రెండ్ కనుక చెప్తున్నాను."

అంటూ ఎంతో దీనంగ చెప్పాడు. కమల ఆరోజు మనిషి మనిషిగాలేదు. అంది సరోజిని.

"అతను వెళ్లి ఎన్నిరోజులైంది?"

"నెలరోజు అవుతుంది."

"నీవు అనవసరంగ తనమీద అపోహ పడు తున్నావేమో."

"నేను అలాగే అనుకుని ఊరుకున్నాను. కాని గారి కూడ స్పష్టంగ చెప్పింది. ఎవరోవచ్చారని పైగ రాత్రి ఒక ప్రబంధనాయికలా పలవరిస్తూ ఉంటూంది. ఇంతెందుకు రేపు సాయంకాలం నీవు మారూమ్‌కిరా. ఇద్దరం కలసి వ్యవహారం ఏమిటో కనిపెట్టవచ్చు."

సాయంకాలం కాగానే జయలక్ష్మి అనుకున్న ప్రకారముగ హాజరయింది.

కమల పుస్తకాలు తిరగేస్తోంది చదువు తున్నట్లుగా

"నీవంట్లో ఎలావుంది కమలా" అని అడిగింది.

"బాగానే ఉంది అంది" ముక్తసరిగా.

జయ సరోజిని ఎంతగొడవ చేస్తూన్న వారి దృష్టిలేకపోయింది కమలకు. పుస్తకాలు పట్టుకు ఉండుండి కిటికీగుండ కాంపౌండులోకి చూస్తూంది. ఇదంతా వీరిరువురు కనిపెడుతూనే ఉన్నారు.

నిజంగా గేటుదగ్గర ఎవరో నిల్చున్నట్టయింది జయకి. ఎవరో వస్తున్నట్లుంది సరోజ నీకోసమే కాబోలు అంది కాస్త ఎగతాళిగా ఈ మాట కమలకు పాకులా అనిపించి పైకి చూచింది. అదిగో అతనే ఒక్క క్షణంకూడ నిలబడలేక పోయింది. నేరుగ వరండాలోకి వచ్చి నిలపడింది. కాని కమలకు ఆతృత హెచ్చయింది త్వరత్వరగ నడుస్తు సరాసరి అతని ఎదురుగ వెళ్లింది. కమల హడావిడిలో ఆవచ్చిన వ్యక్తి స్పష్టంగ వారికి కనుపించలేదు కమల వెంటనేవారుకూడ క్రిందికి దిగివెళ్ళారు పెద్దడిటెక్టివుల్లాగ. అతనికి ఎదురుగ వెళ్లి నిలబడింది ఆరాధ్యదేవత ఈ రోజునైన కరుణిస్తాడు. రోజులుగ నిరీక్షిస్తున్న కమల ఆశ యం ఫలించింది. అతను తన దగ్గరకు వచ్చాడు తనకోర్కె చెల్లించాడు. తను తన శ్రీవారివద్ద నుండి ఉత్తరం కోసం ఇన్నిరోజులుగ ఎదురు చూస్తూంది. ఆ ఫలితంగానే అతను ఒక బ్లూ కవరు కమలచేతి కందిచ్చాడు. సంతోష తరం గాలు కమల ముఖంలో ఒక్కసారిగ నాట్యం చేశాయి. ఆనందంతో తొందరగ రూమ్‌కువెళ్లి చదవాలనుకుంది. వెనుకకు తిరిగేసరికి జయ, సరోజ కనుపించారు. "అబ్బ వెళ్లిన ఎన్ని రోజు లకు రాశారో చూడు సరూ! నేను దీనికోసం కన్నులు కాయలుకాసేల ఎదురు చూచాను" అని ఉత్తరం చదువుతూనే పరుగెత్తింది కమల.

అతను, అతను, వస్తాడు అంటే నాయకు డెవరో ఈ విడకోసం వస్తున్నాడను కున్నాడు. నంటు పోస్టుమేనా!!" అంది సరోజ

నాతల్లి మాఅమ్మ ఎంత గొడవ చేశావు. పాపం వాళ్ళ శ్రీవారి వద్దనుండి జాబుకోసం ఆమె తంటాలు పడుతూంటే అన్యాయంగ అభాండం వేశావు తలమీద!"

"నాకేం కమలంటే పగా తను లెటర్‌కోసం చూస్తున్నాను పోస్టువాడు ఇంకారాలేదు అనక అతను రాలేదు. ఈ రోజైనవస్తాడు అని పిచ్చిగ అంటూంటే ఏదోఆపోహపడ్డాను" అంది సరోజ.

"అయినా నీవువట్టి గాభరామనిషివి. ఇదిగో పులంటే అదిగో తోకంటావు సరోజ" అంది జయ నవ్వుతూ.

★